(మినీ కథ)

# మార్పుకు కారణం!

రచన: శ్రీ అరవల్లి ప్రభాకరరావు.

కంచం ముందు కూర్చుని భోజనం చేస్తున్న భార్య కామాక్షమ్మను చూసి ఆశ్చర్య పడ్డాడు యింట్లో అడుగుపెడుతున్న శివానందం. ఎంత సేపైనా రోజూ భర్త రాందే వచ్చి మంచి నీళ్లు కూడా ముట్టని కామాక్షి యింత ఘోరం చేస్తున్నదంటె నమ్మలేక పోయాడు. పోనీ టయిమెంత అయిందో పాపం...యిల్లాలు ఆకలికి తాళలేక పోయివుంటుందని సరిపుచ్చుకుని చేతినున్న వాచిలోకి చూశాడు. పన్నెండు అవటానికి యింకా అయిదారు నిమిషాలు వెనకకే వుంది.

"తినుతిను పర్వాలేదు మంచి పనిచేశావు" ఒకపుడు తనని చూసి కంగారుపడి చెయ్యి కడిగేసుకుంటుందేమో నన్న కనికరంతో ఓ చిన్న సింపతీ డైలాగువదిలి కండువాతీసి పాగా కొయ్యకు దోపాడు. కామాక్షమ్మ కంగారు పడలేదు సరికదా మారు జవాబు లేకుండా గబగబ తనపని ముగించుకున్నాది.

"చోటుచేశాను. అన్నీ అక్కడేవున్నాయి. వెళ్ళి వడ్డించుకు తినండి నడుం కాస్త పీకుతున్నాది" దిండు చేత్తోపట్టుకున్న కామాక్షి డైలాగు విన్న శివానందం గుండెల్లో కంపం మొదలయింది. భర్తంటె దైవంగా పూజించే "నారీతిలకం" భారతదేశం మొత్తం మీద ఒక్కతన భార్యేనని గర్వపడేవాడు. పాతికేళ్ళ సంసారజీవితంలో తన మాటకుగాని తనుచేసిన పనికిగాని ఎదురాడని శాంత స్వరూపిణి తన అర్ధాంగని అందరితోనూ ఛాలెంజిచేసేవాడు. అలాంటిది అనుకోకుండా ఒక్కసారి ఆమెలో యీరోజు వచ్చిన మార్పుకు అదిరిపడ్డాడు. కారణం ఏమిటా? అని తల బద్దలుచేసుకుంటూ ముద్దకు ముద్ద మింగుతూ పళ్ళెం ఖాళీచేశాడు.

"కట్టుకుందికి ఓ మంచిచీరా? పెట్టుకుందికి ఓనగా నట్రానా? ఏమీలేవు...ఎపుడో పదేళ్ళ నాటి పాత క్రేపుశిల్కు చీరలు మాత్రం పెట్టి నిండా తగలబడ్డాయి" గాగుతీసినట్లు పెట్లో చీరలన్నీ పీకుతూ చిరాకుపడింది కామాక్షి ముఖం చీదరించుకుంటూ...

కామాక్షి వాలకం చూసిన శివానందం మతి పూర్తిగా పోయింది.

"ఏమిటోయ్! ఎపుడూ లేదు...చీరలమీధ నగలమీద పడుతున్నావు?" చిరునవ్వు విసురుతూ భార్యకళ్ళల్లోకి చూశాడు. కానీ కామాక్షమ్మ ముఖ కవళికలు మారలేదు. ఉల్లి తొక్కలాంటి ఒళ్ళు కనిపించే చీరలంటె మండిపడే కామాక్షి...భర్త అనురాగాని మించిన ఆభరణాలు లేవని నొక్కివక్కాణించే ఆదర్శ గృహిణి...పురాణాల్లో పతివ్రతల్లా నిత్యం పూజా పునస్కారాలతో తెల్లవార్చే తనవైపు సడన్ గా యిలా ఛేంజి అయిపోయిందంటె, పాపం శివానందం నమ్మలేక తబ్బిబ్బయి పోయాడు. కొంపతీసి దెయ్యం...దేవత...యిలాంటి భయంకర శక్తులేవో ఆవేశించలేదు కదా! అని అనుమాన పడ్డాడు.

"కంగ్రాచ్యులేషన్సు మిస్టర్ శివానందం" మీ శ్రీమతి ఎనభై ఎనిమిది ఓట్ల మెజార్టీతో యీ వార్డుకు కౌన్సిలరుగా ఎన్నికయింది. దాకంత నోరును చెవులువరకూ సాగదీసుకుంటూ షేక్ హేండుకోసం చెయ్యి చాచుతూ ఊడిపడ్డాడు ఇప్పుడర్థమైంది భార్యమార్పుకు కారణం కనకారావుకు.